

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## బాబోయ్...

**రణరంగంలా** ఉన్న వంటిల్లుని చూసి శ్యామల దీర్ఘంగా నిట్టూర్చింది. ‘స్టవ్ మీద వంకాయ ముక్కలు బొగ్గు ముక్కల్లా మారాయి. మిక్సీ జార్‌లో పచ్చడి కచ్చా పచ్చాగా ఉండి, ఇంకో ఐదునిమిషాలు రుబ్బాలంటోంది. నేలంతా కూరల తొక్కలు, హడావిడిగా తన్నేసిన నీళ్ళగిన్నె తాలూకు నీటిచారలు. అదృష్టవశాత్తూ కుక్కర్‌లో అన్నం, పప్పు ఉన్నాయి. ఆయనకి అవి పెట్టి పంపొచ్చు‘ అనుకుంది.

ఆవిడకి అకస్మాత్తుగా దిగులు వచ్చింది. వారం క్రితం దాకా తనకో క్రమబద్ధమైన జీవితం ఉండేది. ఉదయం లేచి ఇష్టంగా నాలుగురకాల వంటకాలు చేసేది. భోజన ప్రియుడైన భర్త నాలుగ్గిన్నెల కేరేజ్‌ని తీసుకెళ్ళేవాడు. సాయంత్రాలు మళ్ళీ వేరే రకాలు రెండు చేసేది. కబుర్లు చెప్పుకుంటూ తినేవారు. భర్త ఆఫీస్‌కి వెళ్ళాక పని ముగించుకుని బంధువులకీ మిత్రులకీ ఫోన్ చేసి మాట్లాడిన మాటల సారాంశం, సమాచారం తను చెపితే, ఆఫీస్ విషయాలు ఆయన చెప్పేవారు. అలాంటిది ఇప్పుడు కుక్కర్ మోగితే భయం. భోజనాల దగ్గర గరిటెలు, గిన్నెలకి తగిలితే ప్రమాదం. ఇంక కబుర్లు, రకరకాల కూరలు ఎక్కడినించి వస్తాయి? వారం నించి ఆయన సహనంగా ఏవి పెడితే అవి తింటున్నారు. మళ్ళీ తమ పాత జీవితం వస్తుందా అనిపిస్తోంది. ఈ పరిస్థితికి తనే కారణమేమో అనే చింతకూడా ఉంది.

నారాయణ మౌనంగా మంత్రాలు చదివి, గణగణ గంటమోగించబోయి, తమాయించుకుని ప్రసాదం పెట్టి లేచాడు. ‘నోరారా మంత్రాలు చదివి, గంట మోగించి ఎంతకాలమైందో‘ అనుకున్నాడు.

ఆయనకి బాధగా ఉంది. వారం క్రితం దాకా తనకో రొటీన్ ఉండేది. అంతా రొటీన్ బోర్ అంటారు కానీ తన రొటీన్ అంటే తనకి చాలా ఇష్టం. సాయంత్రం ఇంటికి వచ్చాక భార్యతో కలిసి కూర్చుని టి.వి సీరియల్స్ చూడడం. మధ్య మధ్యలో ఆమెతో సరసాలాడటం, హాస్యానికి ఫెళ్ళున నవ్వడం.. పడకగది తన సామ్రాజ్యంగా ఉండేది. వారం నించి అన్నీ మారిపోయాయి. టి.వి పెట్టడానికి లేదు. కడుపునిండా తినడానికి రుచికరమైన వంటకాలు లేవు. తన మకాం ముందుగది సోఫాలోకి మారింది. భార్యతో పట్టుమని పదినిమిషాలు మాట్లాడడానికే కుదరడం లేదు. ఈ పరిస్థితికి తనే కారణమేమో అనే అనుమానం కూడా ఆయనకి ఉంది.

''అమ్మా. రాత్రికి లేటవుతుంది.'' లాప్‌టాప్ బేగ్‌ని తగిలించుకుని బయటకి వస్తూ చెప్పాడు ఆదిత్య.

''ష్!'' ఒక్కసారే మూడు కంఠాల మందలింపుగా చెప్పాయి.

ఆదిత్య ఒళ్ళుమండింది. వారం క్రితం దాకా లైఫ్ ఎంత హేపీగా ఉండేది? పొద్దున్నే ఆఫీస్‌కి వెళ్ళడం, సాయంత్రాలు కాలనీ పిల్లలతో క్రికెట్ ఆడటం, చీకటి పడ్డాక ఇంటికి వచ్చి స్నానం చేసి ఫ్రెండ్స్‌తో టెర్రస్ మీద కబుర్లు చెప్పుకోవడం, తొమ్మిదికి అమ్మా నాన్నలతో అన్నం తిన్నేసి వాళ్ళు పడుకోడానికి వెళ్ళగానే తన రూంలోకి వెళ్ళి మ్యూజిక్ వింటూ ఇంటర్నెట్ చూసుకుని పదిగంటలకల్లా పడుకోవడం. అంతా స్వేచ్ఛగా హేపీగా ఉండేది. ఇప్పుడు మ్యూజిక్ లేదు. టెర్రస్ మీద కబుర్లు లేవు. ఇంట్లో మౌనంగా కూర్చోవడమే. తన మూలంగానే ఈ పరిస్థితి వచ్చిందేమో అని గిల్టీగా అనిపించింది.

అకస్మాత్తుగా సైరన్‌లాంటి సన్నధ్వని మొదలై అదే తారాస్థాయికి చేరింది. అంతా ఒక్కసారిగా నిట్టూర్చారు. బుజ్జిగాడు నిద్రలేచాడు.

ఎనిమిది నెలల క్రితం శ్యామల, నారాయణల పెద్ద కూతురుకి బుజ్జిగాడు పుట్టాడు. దాదాపు పాతికేళ్ళ తర్వాత ఇంట్లో పసిపిల్లవాడు అవడంతో వారి ముద్దుకి గారాబానికి అవధుల్లేకుండా పోయాయి. ఆదిత్య ఆ అతి సన్నటి, చిన్నపిల్లవాడ్ని జాగ్రత్తగా ఎత్తుకుని బుల్లి మేనల్లుడ్ని ముద్దులాడేవాడు. కానీ భర్తకి కష్టం అని కూతురు నెలన్నరకే వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఇంట్లోని ముగ్గురికీ కాలక్షేపం బుజ్జిగాడి మాటలు, వాడి ముచ్చట్లే. రోజూ కూతురికి ఫోన్ చేసి విశేషాలు చెప్పించుకుని శ్యామల డైనింగ్ టేబుల్ దగ్గర కథలు కథలుగా చెప్పేది. వాడు బోర్లాపడ్డాడుట, పాకుతున్నాడట, వాళ్ళ అమ్మ నాన్నల్ని గుర్తుపడుతున్నాడట... ఇలా. తండ్రీ కొడుకులు విస్ఫారిత మొహాలతో ఆ కబుర్లన్నీ ఇష్టంగా వినేవాళ్ళు.

రెండువారాల క్రితం డైనింగ్ టేబుల్ ముచ్చట్లలో నారాయణ అన్నాడు.

"పిల్లాడ్ని చూడాలని ప్రాణం కొట్టుకుపోతోంది. ఓసారి వచ్చి పొమ్మని అమ్మాయికి చెప్పరాదు?"

"అవునమ్మ. నాక్కూడా వాడిని చూడాలని ఉంది." ఆదిత్య చెప్పాడు.

"నాకూ అంతే. అది ఫోన్ చేసినప్పుడల్లా చెప్తూనే ఉంటా. ఓసారి రా తల్లీ.. పిల్లాడి ముచ్చట్లు వినడమేకానీ, వాడిని చూసే భాగ్యంలేదా అని. నవ్వి ఊరుకుంటుంది." శ్యామల బాధగా చెప్పింది.

ఆ ఆదివారం ముగ్గురూ కూతురు, అల్లుడుతో మాట్లాడి మొహమాటపెట్టి మొత్తానికి వాళ్ళచేత సరే అనిపించారు.

వారం క్రితం కూతురు మనవడ్ని ఎత్తుకొచ్చింది. వాడికి విపరీతమైన కొత్త. ఏవీ చూసిన మొహాలు కాకపోవడంతో అమ్మని అతుక్కుపోయాడు. దింపితేచాలు ఏడుపు. కూతురు స్నానం చేసేప్పుడు అన్నం తినేప్పుడు ఆ ఐదు పదినిమిషాలు వాడిని సముదాయించడం వాళ్ళకి బ్రహ్మప్రళయమైపోయింది. ఆదిత్య బలవంతంగా ఎత్తుకున్నాడని అప్పుడే వచ్చిన ముందు పళ్ళతో అతని ముక్కు కొరికేసాడు. వాడు. నిద్రపోయేప్పుడు నిశ్శబ్ధంగా ఉండాలి. చిన్నచప్పుడైనా లేచి కూర్చుంటాడు. కలత నిద్రలో లేస్తే రెండుమూడు గంటలపాటు ఏడుస్తూనే ఉంటాడు.

రెండురోజుల్లోనే ఇంటిల్లిపాదీ బెంబేలెత్తిపోయారు. వాడు లేచాడంటే భయపడిపోయి బిక్కచచ్చిపోతున్నారు. దానికి తోడు కూతురు అతిగారాబం అతి ముద్దుతో వాళ్ళని పిచ్చెక్కిస్తోంది. చిన్నశబ్దం చేసినా ఊరుకోదు. టి.వి.ని నిషేధించింది. ఆదిత్య ఆడడానికి పోతే, 'అందుకేనా నన్ను రమ్మంది' అని నిష్టూరాలాడింది. దాంతో ఆఫీస్ నించి వచ్చి బొమ్మలా కూర్చుంటున్నాడు. మేనల్లుడితో ఆడదామంటే వాడు రాడు, గోళ్ళతో రక్కడం, కొరకడం చేస్తున్నాడు. నిద్రపోతే మనుషులు విగ్రహాల్లా ఉండాల్సిందే మ్యూజిక్ పెట్టుకోడానికి లేదు. వాడు పిల్లరాక్షసుడిలా తయారయ్యాడని గొణుక్కున్నాడు కాని, పైకి అనే ధైర్యం చేయలేకపోయాడు.

శ్యామల, నారాయణల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీలేదు. వాడు ఫేక్టరీ సైరన్‌లా కయ్‌మనగానే చేష్టలుడిగిపోతున్నారు. వారమైనా అలవాటు కాలేదు. కూతురి ఒంట్లో ఒక అవయవంలా అమరిపోయారు. వాడు పాకడం చూడలేదు నవ్వడం చూడలేదు. కూతురు ఫోన్‌లో వర్ణించిన ఏ విన్యాసం వాళ్ళు చూడలేదు.

"ఆయనకి పిల్లాడిమీద, నా మీద దిగులుగా ఉందిటమ్మా. రేపు శనివారం బయల్దేరతా" ఫోన్‌లో మాట్లాడి కూతురు చెప్పింది.

"అలాగే" ముగ్గురూ ముక్తకంఠంతో చెప్పారు.

తను వచ్చేదాకా రమ్మని తెగ బతిమాలిన వాళ్ళు, వెంటనే 'సరే' అనడంతో వాళ్ళు హర్ట్ అయారని కూతురు భావించింది.

"సారీ! ఇంకో పదిరోజులు ఉందామనే అనుకున్నాను. కానీ ఆయన ఒకటే గొడవ. పోనీ వీడి బర్త్‌డే అయ్యాక వచ్చి రెండువారాలుండి వెళ్తాలే. ప్రామిస్." ఓదార్పుగా చెప్పింది.

"హుఁ..!" ముగ్గురూ ఒకేసారి నిట్టూర్చారు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments